జర్నలిస్టుల ఇండ్ల రద్దు నిర్ణయం దారుణం

- పండుగవేళ కరీంనగర్ జర్నలిస్టుల్లో ఆవేదన
- రాజకీయ కక్షతోనే ప్రభుత్వ నిర్ణయం
- ఎక్స్ వేదికగా హరీశ్‌రావు ధ్వజం

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): కరీంనగర్‌లో జర్నలిస్టుల ఇండ్ల స్థలాలను ప్రభుత్వం రద్దుచేయడం శోచనీయమని, జర్నలిస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే దసరా కానుక ఇదేనా? అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కరీంనగర్‌లో 118 మంది జర్నలిస్టులకు కేటాయించిన ఇండ్ల స్థలాలను కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తీసుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సోమవారం ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. రాజకీయ కక్షలో భాగంగానే బతుకమ్మ, దసరా పండుగల వేళ జర్నలిస్టుల కుటుంబాల్లో ఆవేదనను మిగిల్చడం అన్యాయమని పేర్కొన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిత్యం శ్రమించే జర్నలిస్టుల పట్ల కాంగ్రెస్ వ్యవహరిస్తున్న దుర్మార్గ వైఖరికి ఇది మరో నిదర్శనమని తెలిపారు. జర్నలిస్టులకు, వారి కుటుంబాలకు అన్యాయం చేయొద్దని, ప్రభుత్వం వెంటనే జర్నలిస్టుల ఇండ్ల స్థలాల రద్దు ప్రకటనను ఉపసంహరించుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నామని హరీశ్‌రావు తెలిపారు.

ఎగవేతలకు కేరాఫ్ కాంగ్రెస్

- రుణమాఫీపై సీఎం రేవంత్ పచ్చి అబద్ధాలు
- పంటకాలం దాటినా రైతు భరోసాలేదాయే
- బోనస్ పేరిట బక్వాస్ చేస్తున్న సర్కార్
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫైర్

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): రైతు రుణమాఫీ, ధాన్యానికి బోనస్, రైతుభరోసా, ఆసరా పింఛన్ పెంపును ఎగ్గొట్టిన కాంగ్రెస్ సర్కారు ఎగవేతలకు కేరాఫ్‌గా మారిందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్టేసి పచ్చి అబద్ధాలు చెప్పారని మండిపడ్డారు. రెండు నెలలవుతున్నా ఎందుకు అమలు చేయడంలేదని నిలదీశారు. హైదరాబాద్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రుణమాఫీ పూర్తయ్యేదాకా రైతుభరోసా ఇవ్వబోమని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చెప్పడం దారుణమని పేర్కొన్నారు. ధాన్యానికి రూ.500 బోనస్ పేరిట రైతులను బక్వాస్ చేశారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఇలాంటి ప్రభుత్వం ఉండటం ప్రజల దురదృష్టమని పేర్కొన్నారు. ఇప్పటికైనా రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈ బోగస్ సర్కారుకు తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

మైనంపల్లిపై కేసు నమోదు చేయాలి

లీగల్ ఒపీనియన్ పేరిట తాత్సారమెందుకు? ● బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తేతెలంగాణ): తమ పార్టీ కార్యకర్తలు తనతోపాటు హరీశ్‌రావు, కేటీఆర్‌పై పెట్రోల్ పోస్తరని, ఇందుకు ప్లాన్ చేశానని.. ఆ ఇద్దరు నేతలు చావకుంటే పట్టుకొనైనా చంపేస్తమని కాంగ్రెస్ నేత మైనంపల్లి హన్మంతరావు చేసిన వ్యాఖ్యలపై కేసు నమోదు చేయాలని బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ విషయంలో డీజీపీ వెంటనే స్పందించాలని కోరారు. సోమవారం 'ఎక్స్'లో ఇందుకు సంబంధించిన వీడియోను జత చేసి మాట్లాడారు. ఈ విషయంలో డీజీపీ వెంటనే స్పందించాలన్నారు. ఈ ఘటనపై అక్టోబర్ 3న గజ్వేల్ ఠాణాలో ఫిర్యాదు చేశామని తెలిపారు. అక్కడి పోలీసు అధికారులు లీగల్ ఒపీనియన్ పేరిట నాలుగు రోజులుగా నాన్చుతున్నారని ఆరోపించారు. అధికారుల విధులను అడ్డగించారనే నెపంతో హైడ్రా బాధితులను అరెస్ట్ చేసినప్పుడు లీగల్ ఒపీనియన్ ఎందుకు తీసుకోలేదని నిలదీశారు. అంటే కాంగ్రెస్ పాలనలో సామాన్యులకు ఓ న్యాయం.. కాంగ్రెస్ నేతకు మరో న్యాయమా? అంటూ ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం 'ఎక్స్'లో మైనంపల్లి అన్న మాటల వీడియోను పోస్ట్ చేశారు.

దొడ్డు వడ్లకూ బోనస్ ఇవ్వాలి

- 7314 కోట్లకు 2350 కోట్లే కేటాయింపు
- ధాన్యం ఎక్కడ అమ్మినా బోనస్ చెల్లించాలి
- రైతుల పక్షాన బీఆర్‌ఎస్ పోరాటం
- సీఎం రేవంత్‌కు మాజీ ఎమ్మెల్యే పెద్ది లేఖ



హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ) : రైతులు పండించిన అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ చెల్లించాలని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మద్దతు ధరతో పాటే రైతుల అకౌంట్లలో బోనస్ వేయాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ప్రతి పంటకు బోనస్ చెల్లించాలని, కేవలం సన్న రకానికే ఇస్తామంటే కుదరని, ఈ విషయంలో రైతుల పక్షాన పోరాడుతామని స్పష్టంచేశారు. ఈమేరకు ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి సోమవారం లేఖ రాశారు.వానకాలం పంట 1,46,28,000 మెట్రిక్ టన్నుల దాన్యానికి బోనస్ రూ.500 చొప్పున అంటే సుమారు రూ.7,314 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని లేఖలో పేర్కొన్నారు. సన్నరకాలకు సంబంధించి 88.09 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారని, దీనికి సుమారు రూ.4,404 కోట్ల బోనస్ చెల్లించాల్సి ఉంటుందని, దొడ్డు వడ్లకు రూ.2,909 కోట్ల బోనస్ చెల్లించాలని చెప్పారు. ఈ మొత్తం ధాన్యంలో కోత పెడుతూ ప్రభుత్వం 47 లక్షల మెట్రిక్ టన్నులే కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నదని, మొత్తం రూ.7,314 కోట్ల బోనస్ ఇవ్వాల్సి ఉంటే కేవలం రూ.2,350 కోట్లు మాత్రమే బోనస్ చెల్లించేలా కొర్రీలు పెడుతున్నదని విమర్శించారు.

ఎక్కడ అమ్మినా ఇవ్వాలి..

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మితేనే బోనస్ ఇస్తామనటం సరికాదని పెద్ది సూచించారు. సన్నరకం బోనస్‌తో కలిపి రూ.2,820కి కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెప్పిందని, ప్రైవేట్ వ్యాపారులు, మిల్లర్లు, ఇతర ట్రేడర్లు ఇప్పటికే తేమ శాతాన్ని పరిగణలోకి తీసుకోకుండా రూ.2,600 నుంచి రూ.3వేలకు కొంటున్నారని చెప్పారు. బోనస్‌తో కలిపినా రూ.2,820 మాత్రమే అవుతున్నప్పుడు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మితే రైతుకు క్వింటాల్‌పై రూ.200 నష్టం జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వ కేంద్రాల్లో పంట అమ్మలేదనే సాకుతో బోనస్‌ను ఎగ్గొట్టే ప్రయత్నం చేయవద్దని, రైతు ఎక్కడ ధాన్యం అమ్మినా బోనస్ చెల్లించాల్సిందేనని డిమాండ్‌చేశారు. బోనస్ విషయంలో కొర్రీలు పెడుతున్నట్టు సమాచారం ఉన్నదని పాత పద్ధతిలో మద్దతు ధర మాత్రమే రైతులకు చెల్లించి తర్వాత బోనస్ ఖాతాల్లో వేస్తామని చెప్పడం దాటవేత ధోరణికి నిదర్శనమని విమర్శించారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

రైతు ధర్నాలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి డిమాండ్

చిట్యాలలో రైతు ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

చిట్యాల, అక్టోబర్ 7: ఎన్నికల ముందు రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం భేషరతుగా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. రైతులందరికీ రుణమాఫీ చేయాలంటూ సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో రైతులకే కాదు మహిళలకు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయలేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులపై దాడులు చేస్తే కింది నాయకులు బయటకు రారనే భ్రమలో కేటీఆర్, హరీశ్‌రావుపై దాడులకు పాల్పడుతున్నారని, ఇది ఉద్యమ పార్టీ అని, ఎన్ని దౌర్జన్యాలు ఎదురైతే అంత బలపడుతుందని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి సీఎం అనే హూందాతనాన్ని మరిచి వీధి మనిషిలా చిల్లర భాష ఉపయోగిస్తున్నారని ఎద్దేవా చేశారు. రైతులకు రుణ మాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 10 నెలలు దాటినా మాఫీ చేయకుండా రకరకాల కొర్రీలు పెడుతున్నదని దుయ్యబట్టారు. మహిళలకు ఇచ్చిన హామీలను కూడా తుంగలో తొక్కారని, ప్రభుత్వంలోని ఓ మహిళా మంత్రి తోటి మహిళ వ్యక్తిగత జీవితంపై నిందారోపణలు చేస్తే ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడం దారుణమని పేర్కొన్నారు. కొండా సురేఖను వెంటనే ప్రభుత్వం నుంచి, కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఫార్మాకు వ్యతిరేకంగా రేపు పాదయాత్ర

రైతులకు వంద శాతం రుణమాఫీ చేయాలి ● మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి డిమాండ్

కోస్గి, అక్టోబర్ 7: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు రైతులకు వంద శాతం రుణమాఫీ చేయాలని, కొడంగల్‌లో ఫార్మా కంపెనీ ఏర్పాటును వెనక్కి తీసుకోవాలని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గంలో 14 వేల ఎకరాలను గత ప్రభుత్వం కేటాయించగా.. ల్యాండ్ అక్యూవేషన్ పూర్తి చేసుకున్న తర్వాత అక్కడ కాదని.. దుద్యాల మండలంలో ఫార్మా కంపెనీ ఏర్పాటు సరికాదని చెప్పారు. రేవంత్ సర్కారు తీరును వ్యతిరేకిస్తూ 9న ఉదయం 7 గంటలకు పోలేపల్లి ఎల్లమ్మ ఆలయంలో పూజల అనంతరం పాదయాత్ర చేపట్టనున్నట్టు తెలిపారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డితో కలిసి హకీంపేట్, ఆర్‌బీ తండా, లగచర్ల, దుద్యాల్ వరకు 10 కిలోమీటర్లు యాత్ర కొనసాగుతుందని, అక్కడ ముగింపు కార్యక్రమంలో సబితా ఇంద్రారెడ్డి పాల్గొంటారని చెప్పారు. రైతులు, యువకులు, ఫార్మా బాధితులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, కేసీఆర్ అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ ఇచ్చిన ఉద్యోగాలేవి?

- కొత్త నోటిఫికేషన్ లేదు.. ఉద్యోగం లేదు
- అబద్ధాలకు రేవంత్ బ్రాండ్ అంబాసిడర్
- ఢిల్లీకి మూటలు పంపడంపైనే సీఎం దృష్టి
- సింగరేణి లాభాలు కాంగ్రెస్ నేతల జేబుల్లోకి
- మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ మండిపాటు

సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ ఇచ్చిన నోటిఫికేషన్లు, ఉద్యోగాలు కాకుండా కాంగ్రెస్ సర్కార్ కొత్తగా ఎన్ని నోటిఫికేషన్లు వేసిందో? ఎన్ని కొత్త ఉద్యోగాలిచ్చిందో చెప్పాలని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ వచ్చాక కొత్తగా నోటిఫికేషన్లు, ఉద్యోగాలేవీ ఇవ్వలేదని స్పష్టంచేశారు. అబద్ధాలకు రేవంత్‌రెడ్డి బ్రాండ్ అంబాసిడర్ అని, నయా మోసగాడని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ఇచ్చిన నోటిఫికేషన్లకు ఈవెంట్ మేనేజ్‌మెంట్ లాగా రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు ఇస్తున్నారని ఎద్దేవాచేశారు.

ఒక్క హామీ అమలు కాలే

హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ పేరుతో ప్రియాంక గాంధీతో సభ ఏర్పాటు చేశారని, నిరుద్యోగ భృతి ఇస్తామని ఆమెతో చెప్పించారని, ఏటా ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇస్తామని చెప్పారని, 18 ఏండ్లు నిండిన ఆడపిల్లలకు ఎలక్ట్రిక్ స్కూటీలు ఇస్తామని చెప్పారని, వీటిలో ఒక్క హామీని కూడా అమలు చేయలేదని బాల్క ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారంలోకి రాగానే మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పారని, మరో రెండు నెలలైతే ఏడాది పూర్తవుతుందని, ఈ రెండు నెలల్లో రెండు లక్షల ఉద్యోగాల భర్తీ ఎలా సాధ్యమని ప్రశ్నించారు.

నిరుద్యోగుల నోట్లో మట్టి

ప్రభుత్వ రంగంలో లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామని బీఆర్‌ఎస్ చెప్పిందని, తాము అధికారంలో ఉన్నప్పుడు 1.60 లక్షల ఉద్యోగాలను భర్తీ చేశామని, మరో 43వేల ఉద్యోగాల భర్తీ వివిధ దశల్లో ఉందని సుమన్ తెలిపారు. టీఎస్‌ఐపాస్ ద్వారా ప్రైవేట్ రంగంలో 24 లక్షలకు పైగా ఉద్యోగాలు వచ్చాయని, 2.32లక్షల ఉద్యోగాల భర్తీకి ఆర్థిక శాఖ ఆమోదం తెలిపిందని, 2.27 లక్షల ఉద్యోగాలకు బీఆర్‌ఎస్ హయాంలో నోటిఫికేషన్లు ఇచ్చామని, బీఆర్‌ఎస్ సర్కార్ ఆరు వేల టీచర్ల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం మరో ఐదు వేలు కలిపి నోటిఫికేషన్ ఇచ్చిందని గుర్తుచేశారు. నిరుద్యోగుల నోట్లో కాంగ్రెస్ మట్టికొట్టిందని, మూటలు సర్దుకోవడం, ఢిల్లీకి పంపడంపై రేవంత్ రెడ్డి బిజీగా ఉన్నారని ఆరోపించారు. నిరుద్యోగులను రేవంత్‌రెడ్డి ఎందుకు కలవడం లేదని?, ఒక్క మంత్రి అయినా నిరుద్యోగులకు అపాయింట్‌మెంట్ ఇస్తున్నారా? అంటూ నిలదీశారు. మరో రెండు నెలలు ప్రభుత్వానికి సమయం ఇచ్చి ఆ తర్వాత నిరుద్యోగ యువతతో కలిసి ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సింగరేణి కార్మికులకు ఇచ్చే బోనస్‌లో కొత పెట్టారని, కార్మికులకు రూ.3.80 లక్షలు రావాల్సి ఉంటే కేవలం రూ.1.90 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకొన్నారని, కార్మికుల బోనస్ డబ్బులు కాంగ్రెస్ నాయకుల జేబుల్లోకి వెళ్లాయని విమర్శించారు. మీడియా సమావేశంలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు, బీఆర్‌ఎస్ నాయకులు ఆర్ అభిలాషరావు, నరేశ్‌రెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

దసరాలోగా హామీలను అమలు చేయాలి

తెలంగాణ ఆటో, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్స్ జేఏసీ

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): ఎన్నికల్లో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను దసరా పండుగలోపే అమలు చేయాలని తెలంగాణ ఆటో, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్స్ జేఏసీ నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి కోల్పోయే ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12,000 భృతి ఇస్తామని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పిన సర్కారు ఆరు నెలలైనా పట్టించుకోవడం లేదని జేఏసీ నాయకులు నందకిషోర్, నర్సింహారెడ్డి, యాకన్న, రవికుమార్, ఈశ్వర్, లిఖిత్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనతో తెలిపారు. ఉపాధి కరువై పలువురు ఆటోడ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకున్నారని పేర్కొన్నారు. మృతులను కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. దసరా పండుగలోపు కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుంటే తెలంగాణ ఆటో, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్స్ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే దివ్యాంగుల అభ్యున్నతి

- కాంగ్రెస్ అవినీతి ఆరోపణలు హాస్యాస్పదం
- చేతనైతే మంచి పథకాలు అమలుచేయండి
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే దివ్యాంగుల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేశామని, అలాంటి తమ ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. బీఆర్‌ఎస్ హయంలో వికలాంగుల సంక్షేమం శాఖలో భారీ అవినీతి జరిగిందని శాఖతో సంబంధం లేని హరీశ్‌రావుపై, తనపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదమని కొప్పుల ఈశ్వర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి నాటి కేసీఆర్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేసిందని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో రూ.500గా ఉన్న సామాజిక పింఛన్‌ను ప్రత్యేక రాష్ట్రంలో తొలుత రూ.1500, తర్వాత రూ.3,016, మూడోసారి 4,000కు పెంచామని గుర్తుచేశారు. విద్యలో ప్రతిభావంతులైన దివ్యాంగ విద్యార్థులకు వికలాంగుల సంక్షేమ శాఖ ద్వారా ప్రీ మెట్రిక్, పోస్టుమెట్రిక్ ఉపకార వేతనాలు అందించామని పేర్కొన్నారు. అంధ బాలికల కోసం ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఆశ్రమ పాఠశాలలు నిర్వహించామని, బుద్ధిమాంద్యం గల విద్యార్థులకు ఉపకార వేతనాలు, ప్రత్యేక పాఠశాలల్లో విద్య, ఏటా రూ.1,000 చొప్పున అందించామని తెలిపారు. స్వయం ఉపాధి కోసం 50 శాతం సబ్సిడీ రుణాలు, వాహనానికి రూ.30 వేల సబ్సిడీ, ఉచితంగా ల్యాప్‌టాప్, ఉపకరణాలు, దివ్యాంగ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించామని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో 25 శాతం సబ్సిడీతో ఉపకరణాలు అందిస్తే.. కేసీఆర్ ప్రభుత్వం వచ్చాక వికలాంగుల సంక్షేమ శాఖ బడ్జెట్ రూ.20 కోట్ల నుంచి రూ.83 కోట్లకు పెంచామని తెలిపారు. సీఎం నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు చివరికి కార్పొరేషన్ చైర్మన్లు అనవసరంగా ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేతనైతే దివ్యాంగులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం కంటే మంచి పథకాలు అమలు చేసి చూపించాలని సవాల్ విసిరారు.

ఆర్థిక సంక్షోభం దిశగా తెలంగాణ

- రుణమాఫీ విషయంలో సీఎం బండారం బట్టబయలు
- రేవంత్ విధానాలతో రియల్ ఎస్టేట్ రంగం కుదేలు
- కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్‌ఎస్ నేత రాకేశ్‌రెడ్డి ధ్వజం

హైదరాబాద్, అక్టోబరు 7 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఆర్థిక సంక్షోభం దిశగా అడుగులు పడుతున్నాయని, ఆర్థిక అత్యవసర పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయని బీఆర్‌ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ఎక్కడ అధికారంలో ఉంటే అక్కడ ఆర్థిక సంక్షోభం తలెత్తుతుందని ధ్వజమెత్తారు. హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణలో పరిస్థితులు ఇందుకు అద్దంపడుతున్నాయని ఆరోపించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో రాకేశ్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ 'రాష్ట్రం ఏర్పడిన నాడు తెలంగాణలోని ఉమ్మడి తొమ్మిది జిల్లాలు వెనకబడిన జిల్లాలుగా ఉండేవి. కానీ గడిచిన పది సంవత్సరాల్లో దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం ఉన్న రాష్ట్రంగా తెలంగాణ గుర్తింపు పొందింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి క్రమంగా కుంటుపడుతున్నది. తొమ్మిది నెలల్లో ప్రభుత్వానికి రూ.89 వేల కోట్ల ఆదాయం రావాల్సి ఉండగా రూ.73 వేల కోట్లు మాత్రమే వచ్చాయి. అందులోనూ అభివృద్ధి పనుల కోసం రూ.8 వేల కోట్లను మాత్రమే ఖర్చు చేసింది. మరోవైపు కాంగ్రెస్ పాలన ఇల్లు పీకి పందిరేసినట్టు ఉన్నది. ప్రభుత్వ విధానాల వల్ల రియల్ ఎస్టేట్ కుప్పకూలింది. టెక్స్‌టైల్ పరిశ్రమ కుంటుపడింది. గ్రామ పంచాయతీ కార్మికులకు తొమ్మిది నెలలుగా జీతాలు లేవు. ఎస్సీ, ఎస్టీ హాస్టల్స్‌లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇప్పటి వరకు జీతాలు ఇవ్వలేదు. ఉద్యోగులకు ఐదు డీఏలు పెండింగ్ లో ఉన్నాయి. పీఆర్సీ పత్తా లేదు' అని ధ్వజమెత్తారు.

రుణమాఫీపై సీఎం మాటలు అబద్ధం

రుణమాఫీపై ప్రధానికి రాసిన లేఖతో రేవంత్ రెడ్డి బండారం బయటపడిందని, రూ.18 వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేశామని సీఎం ఒప్పుకున్నారని రాకేశ్‌రెడ్డి తెలిపారు. రేవంత్‌రెడ్డి రావడంతోనే కూల్చుడు మొదలు పెట్టారని, ఆయన విధ్వంసం వైపు అడుగులు వేస్తున్నారని చెప్పారు. మూసీ ప్రక్షాళన కాదు.. రేవంత్ రెడ్డి మైండ్ ప్రక్షాళన జరుగాలన్నారు. మూసీ సుందరీకరణతో వచ్చే ఆదాయం ఏంటో సీఎం చెప్పాలని డిమాండ్ చేశారు. సాగునీటి ప్రాజెక్టుల ద్వారా ప్రజలకు లాభం జరుగుతుందని, మూసీ సుందరీకరణ ఎవరికి అన్నం పెడుతుందంటూ ప్రశ్నించారు. మూసీ ప్రాజెక్టు డీపీఆర్ ఎక్కడ ఉన్నదని, ఈ ప్రాజెక్టు కాంట్రాక్టర్‌తో రేవంత్ రెడ్డి ముందే కుమ్మక్కు అయ్యారని ఆరోపించారు. హైడ్రాను వెనక్కి తీసుకోవాలని రాకేశ్ రెడ్డి డిమాండ్ చేశారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్

మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- 15 నుంచి ఆందోళనలు, నిరసనలు
- రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్

రవీంద్రభారతి, అక్టోబర్ 7: రాష్ట్ర ప్రభుత్వం దసరా పండుగలోపే తాజా మాజీ సర్పంచ్‌లకు రావాల్సిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని, లేకుంటే ప్రభుత్వంపై పోరాటం చేస్తామని తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో గెలిచిన సర్పంచ్‌లమనే సాకుతో కక్షగట్టి పెండింగ్ బిల్లులు ఇవ్వడంలేదని ఆరోపించారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సుర్వి యాదయ్యగౌడ్ మాట్లాడుతూ తాజా మాజీ సర్పంచ్‌లు వడ్డీలకు డబ్బులు తెచ్చి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసి అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, కొంత మంది ఆత్మహత్యలు కూడా చేసుకున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం 10 నెలలు గడుస్తున్నా పెండింగ్ బిల్లులు చెల్లించడంలేదని, దసరా పండుగ తరువాత 15 తేదీన సర్పంచ్‌ల సంఘం ముఖ్యనాయకులతో సమావేశమై ప్రభుత్వంపై ఆందోళనలు, నిరసనలు చేపడుతామని వెల్లడించారు. కార్యక్రమంలో సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్‌రెడ్డి, మాట్ల మధు, రాంపాక నాగయ్య, సుభాష్‌గౌడ్, మెడబోయిన గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

లోకం పోకడ



హెడ్డింగ్ ఇలా పెట్టొద్దని ఎన్నిసార్లు చెప్పాలయ్యా? ఆయన హైదరాబాద్ తిరిగి వచ్చేటప్పుడు "హైదరాబాద్‌కు రేవంత్" అని పెట్టమన్నా గదా!

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	37.5°c	24.0°c
రంగారెడ్డి	37.1°c	19.8°c
మెదక్	36.1°c	20.7°c
నిజామాబాద్	35.6°c	24.9°c
ఖమ్మం	32.0°c	23.0°c
హైదరాబాద్	31.6°c	22.3°c
మహబూబ్‌నగర్	30.5°c	23.4°c
నల్లగొండ	29.5°c	24.0°c
కరీంనగర్	28.0°c	24.0°c
వరంగల్	28.0°c	22.0°c

రాష్ట్రంలో నేడు, రేపు వర్షాలు

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తేతెలంగాణ): రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మంగళ, బుధ వారాల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మంగళవారం నాడు ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మ ల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న-సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి-కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని పేర్కొంది.

'టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్‌సీర్' వెరిఫికేషన్

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్ సీర్ పోస్టుకు ఎంపికైన అభ్యర్థులకు 21నుంచి 24వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని టీజీపీఎస్సీ సోమవారం తెలిపింది. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో వెరిఫికేషన్ జరుగుతుందని తెలిపింది. వెబ్ ఆప్షన్లకు 20 నుంచి లింక్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందని తెలిపింది. షార్ట్ లిస్ట్ చేయబడిన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు https://www.tspsc.gov.inలో అందుబాటులో ఉన్న చెక్ లిస్ట్, అటెస్టేషన్ ఫారంలను డౌన్‌లోడ్ చేసి తీసుకురావాలని సూచించింది.

శిల్పాన్ని చూపిస్తున్న పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి

వెల్మజాలలో 'ఎక్కటి శిల్పం'

13వ శతాబ్దం నాటిదిగా గుర్తింపు

గుండాల, అక్టోబర్ 7: యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం వెల్మజాల గ్రామంలో 13వ శతాబ్దం నాటి పొడవు జడ కలిగిన వీరుడి శిల్పాన్ని(ఎక్కటి శిల్పం) చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి కనుగొన్నారు. గ్రామంలోని శివుడి బండ మీద ఉన్న రాతి శిల్పంతో కూడిన శిలాశాసనాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 13వ శతాబ్దం నాటి వీరులు పొడవైన జుట్టును కలిగి ఉండేవారని, వాటిని పాయలుగా విడదీసి అల్లినట్లుగా ఉండేవని తెలిపారు. అందుకు సంబంధించిన ఆనవాళ్లను శిలపై చెక్కిన శిల్పంలో ఉన్నట్టు చెప్పారు. అటువంటి వీరులు గ్రామ రక్షణ కోసం రణరంగంలో పోరాడేవారని పేర్కొన్నారు. భుజాలకు దండ కడియాలు, నడుముకు కత్తి, కాళ్లకు కడియాలు ధరించి బాణం సంధిస్తున్నట్టు బండరాతిపై వీరుడి చిత్రం చెక్కబడిందని తెలిపారు. ఆ వీరుడి జ్ఞాపకార్థంగా నాటి పాలకులు శిల వేసి ఉంటారని వెల్లడించారు.

మావోయిస్టులు ఉద్యమపంథా మార్చుకోవాలి: నారాయణ

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): మారిన పరిస్థితులకు అనుగుణంగా మావోయిస్టులు తమ ఉద్యమ పంథా మార్చుకోవాలని, ఆయుధాలతో కాకుండా ప్రజలతో కలిసి పోరాడాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ అన్నారు. సోమవారం న్యూఢిల్లీలో నారాయణ మాట్లాడుతూ.. దేశంలో హత్యలు, లైంగికదాడులు పెరుగుతున్నాయని, వాటిని నిరోధించడంపై దృష్టిపెట్టాల్సిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా.. మావోయిస్టుల ఏరివేత కోసం సమావేశాలు పెడుతున్నారని ఆరోపించారు.